క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 45, బెండ 40, కాకర 60, దొండ 30, దోస 40, ఆలు 30, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 110, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 15, క్యారెట్ 50, చిక్కుడు 90, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

విద్యుత్ సమస్యలు ఉంటే...

చందానగర్ : హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే కింద వాటి నంబర్లను సంప్రదించవచ్చు.

- ఏఈ దీప్తి, చందానగర్ : 87124 69634
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ : 87124 69655
- లైన్ ఇన్‌స్పెక్టర్ 1 : 87124 69641 (మదీనాగూడ, వైశాలీనగర్, వినాయక్‌నగర్, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, ఏపీజీఏ కాలనీ, సీఎంతోట, మైత్రీనగర్ ఫేజ్ -1,2, శిల్పా గార్డెన్స్, రామకృష్ణనగర్, ఆర్టీసీ కాలనీ)
- లైన్ ఇన్‌స్పెక్టర్ 2 : 87124 69647 (న్యూ హఫీజ్‌పేట్, మార్తాండనగర్, ప్రేమ్ నగర్, బి-బ్లాక్, హనీఫ్ కాలనీ, గోపాల్‌రెడ్డి నగర్, గణేష్ టెంపుల్)

సన్మానం



ఇన్‌స్పెక్టర్ వినోద్‌రెడ్డిని సన్మానిస్తున్న కమర్షియల్ విభాగం సిబ్బంది

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌రెడ్డిని ఉద్యోగులు గురువారం సన్మానించారు. బదిలీ అయిన వినోద్‌రెడ్డిని సిబ్బంది జ్ఞాపిక, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహకరించిన సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. నూతన కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా స్వామి నియమితులయ్యారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ రవీందర్, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆసుపత్రిలో ఈవెనింగ్ క్లినిక్ ప్రారంభం



ఈవెనింగ్ క్లినిక్‌ను ప్రారంభించిన డాక్టర్లు

మాదాపూర్: మాదాపూర్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో గురువారం ఈవెనింగ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ప్రతి రోజు సాయంత్రం 5గంటల నుంచి 8గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఉదయం సమయంలో ఆసుపత్రికి వెళ్ళలేనివారిని దృష్టిలో పెట్టుకుని సాయంత్రం క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు సేవలు అందుబాటులో ఉంటాయి.

భవనంపై నుంచి పడి యువకుడు మృతి

మియాపూర్: నిర్మాణంలో ఉన్న భవనం నాల్గవ అంతస్తు నుండి ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు కిందపడి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం ఖబీర్ జిల్లాకు చెందిన కాశీకాండే కుమారులు వికేందర్ రాజ్‌కాండే(22), ఆకాష్‌కాండేలు బతుకుదెరువు నిమిత్తం నెల క్రితం నగరానికి వచ్చి పటాన్‌చెరు పటేల్‌గూడలో నివాసముంటున్నారు. మదీనాగూడలోని జాతీయ రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో కూలీలుగా పనిచేస్తున్నారు. గురువారం 9 గంటల సమయంలో భవనం నాల్గవ అంతస్తులోని లిఫ్ట్ గదిలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా కర్ర విరగడంతో వికేందర్‌రాజ్ కాండే నాల్గవ అంతస్తునుండి గ్రౌండ్ ఫ్లోర్‌లో పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. బిల్డర్ నిర్లక్ష్యం కారణంగా కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడని కార్మిక సంఘం నాయకులు ఆరోపించారు. జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్లనే మృతి చెందాడని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

గుంతలు.. బురదమయం



మాదాపూర్ అయ్యప్పసొసైటీలో వర్షానికి ఛిద్రమైన రోడ్లు



మాదాపూర్: కొద్దిపాటి వర్షానికే రోడ్లు ఛిద్రమవుతున్నాయి. మాదాపూర్‌లోని చంద్రనాయక్ తండా, సర్వే ఆఫ్ ఇండియా, సాయినగర్, అయ్యప్పసొసైటీ తదితర ప్రాంతాలలో రోడ్లన్నీ చిన్నవర్షానికే బురదమయంగా తయారవుతున్నాయి. గుంతల రోడ్లపై ఎక్కడ నీరు నిలుస్తుందో తెలియడం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఐటీ ప్రాంతం కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తుంటారు. రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దానికితోడు రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలుండడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.







చందానగర్ సర్కిల్ పక్కన ఉన్న అంబేద్కర్ కల్యాణ మండపం ముందు గుంతలు పడ్డ పార్కింగ్ స్థలం



అయ్యప్పసొసైటీ విగ్రహం రోడ్డు పక్కన వ్యర్థాలు



చందానాయక్ తండాలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు



చందానగర్ మంజీరా రోడ్డులో భవన నిర్మాణ వ్యర్థాలు





వాహనాలు పాడవుతున్నాయి..



చిన్న వ్యాపారులు, ఉద్యోగులు ఎక్కువగా ద్విచక్రవాహనాలను వాడుతుంటారు. సంపాదించిన దిన డబ్బులో అధిక భాగం వాహనాల మరమ్మతులకే ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇకనైనా అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– భిక్యానాయక్, కాలనీవాసి

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

పటాన్‌చెరు టౌన్: రాష్ట్రంలో చట్ట వ్యతిరేకంగా కొనసాగుతున్న గోవధశాలలను తక్షణమే మూసివేయించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యకారి రవి డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్ తహసీల్దార్‌లకు, అమీన్‌పూర్ సీఐ నరేష్‌కు వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బక్రీద్ సందర్భంగా హైదరాబాద్‌కు అక్రమంగా గోవులను తరలిస్తున్నారని తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోవధ నిషేధ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఆయనతో



సీఐ నరేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యకారి రవి

పాటు ప్రఖండ కార్యకారి రామచంద్రుడు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్‌రెడ్డి, అమీన్‌పూర్ బీజేపీ నాయకుడు కొండ లక్ష్మణ్ గుప్తా, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ. వెయ్యి, మరో నలుగురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం



మణికొండ: మంచిరేవుల శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు గురువారం ఉదయం వేదమంత్రోచ్చారణల మధ్య ధ్వజారోహణం, బలిహరణం పూజలను నిర్వహించారు. అనంతరం హారతి, ప్రసాద గోష్టిలను నిర్వహించారు. సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానం, హనుమంత వాహనసేవలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో శుక్రవారం ఉదయం 9 గంటలకు స్వామి వారికి అష్టోత్తర శతకలశాభిషేకం, సాయంత్రం గరుడ వాహన సేవ, ఎదుర్కోలు, రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం ఉంటుందని ఆలయ పండితులు తెలిపారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో 15 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఏఈ శ్రావణితో కలిసి గురువారం పరిశీలించారు. కాలనీలో కొన్ని ఇళ్లు తక్కువ ఎత్తులో ఉండటంతో రోడ్డు నిర్మిస్తే ఎత్తు పెరిగి వర్షాకాలంలో ఇబ్బంది అవుతుందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన వరద నీరు ఇళ్లల్లోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకొని సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయ



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

కులు సమ్మారెడ్డి, మల్లేష్, ముజీబ్, ఫారూఖ్, ఖలీమ్, రాజుగౌడ్, శ్రీను, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- దళారులను ఆశ్రయించవద్దు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాస పథకం, ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పథకాల అమలుపై ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేని నిరుపేదలకు సొంత స్థలం ఉంటే 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తూ సొంతింటి కలలు సాకారం చేయడమే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా 3,500 ఇళ్లు మంజూరు కాగా.. మొదటి విడతలో 1032 మంది లబ్ధిదారులకు నిధుల మంజూరు పత్రాలు అందజేయడం జరిగిందని తెలిపారు. నేటి నుండి లబ్ధిదారులు తమ ఇంటి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులందరికీ 50 వేల నుండి నాలుగు లక్షల రూపాయల రుణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. జూన్ 2న 50 వేల మరియు లక్ష రూపాయల విలువైన యూనిట్ల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులందరికీ మంజూరు పత్రాలు అందజేయబోతున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

కారు డ్రైవర్ అదృశ్యం

గచ్చిబౌలి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ కారు డ్రైవర్ అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మణికొండ శివాజీనగర్‌లో నివాసం ఉండే ఎర్రోళ్ల రవికుమార్(33) కారు డ్రైవర్. ఈనెల 21న సాయంత్రం 6 గంటల సమయంలో తన బావమరిది బైక్ తీసుకొని బయటకు వెళ్లాడు. రాత్రైనా తిరిగి రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రెండు రోజుల క్రితం ఆ ఫోన్ నుంచి ఓ వ్యక్తి మాట్లాడుతూ తాను పోలీసునంటూ ఈ ఫోన్ గల వ్యక్తి చనిపోయాడని చెప్పారన్నారు. ఎక్కడి నుంచి మాట్లాడుతున్నారని వివరాలు చెప్పండని అడగడంతో ఫోన్ పెట్టేయడంతో పై మేరకు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కాలనీల అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు టౌన్: కొత్తగా ఏర్పడ్డ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్‌లో ఇషా బ్లూమ్స్ కాలనీలో రూ.15 లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్, ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్,



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నీలం మధు

మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మాజీ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టండి

మణికొండ: గండిపేట నుంచి నగరానికి వెళ్తున్న క్యాండూట్ వాల్వ్‌ల నుంచి రోజూ లక్షల లీటర్ల నీరు వృథాగా అవుతోంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి లీకేజీలు ఏర్పడిన చోట వెంటనే మరమ్మతులు చేపట్టి వృథాను అరికట్టాల్సిన అధికారులు ఆ పని మాది కాదు అన్నట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 16వ వద్ద వాల్వ్ లీకేజీ అని నీరంతా వృథాగా పోతుందన్నారు. అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా పట్టించుకోవటం లేదని వారు వాపోయారు. ఇకనైనా జలమండలి అధికారులు స్పందించి నీటి లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి



భెల్ ఎంఐజీ కాలనీలో షటిల్ కోర్టు ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని భెల్ ఎంఐజీ కాలనీలో రూ.93 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల శంకుస్థాపన, రూ.23.50 లక్షలతో ఎమ్మెల్యే సీడీపీ నిధులతో నిర్మించిన షటిల్ కోర్టును స్థానిక కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి.మోహన్‌గౌడ్, కాలనీ నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్: సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్, ఎఫ్‌సిఐ, బాలాజీనగర్, ఆదిత్యనగర్, జేపీ నగర్, ఏఎస్ రాజు నగర్ కాలనీలలో రూ.85లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం నారాయణ, డీజీఎం అమీదుద్దీన్, మేనేజర్ సునీత, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

27 కిలోమీటర్లు.. రూ.3.05 కోట్లు

- రెండు విడతలుగా నాలా పూడికతీత పనులు
- అత్యధికంగా చందానగర్ డివిజన్‌కు రూ.1.35 కోట్లు
- మాన్‌సూన్ టీమ్‌లకు ప్రత్యేక వాహనాలు





చందానగర్ సర్కిల్ -21 పరిధిలో నాలాల్లో జరుగుతున్న పూడికతీత పనులు

చందానగర్: వర్షాకాలం ముంపు సమస్య తలెత్తకుండా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు చర్యలు మొదలుపెట్టారు. ముంపు ప్రాంతాల్లో నాలాల పూడికతీత పనులు మొదలుపెట్టారు. కాగా పూడికతీత పనులను రెండు విడతలుగా చేపట్టనున్నారు. ప్రతి సంవత్సరం జనవరి నుంచి మే 31 వరకు తేదీ వరకు, రెండవ విడత పనులు నవంబర్ నుంచి డిసెంబర్‌లో వర్షాకాలం పూరైన తరువాత పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తీస్తారు. మొదటివిడత పనులు దాదాపు పూర్తి అయ్యాయని ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. శేరిలింగంపల్లి జోన్‌లోని చందానగర్ సర్కిల్ 21 పరిధిలో వర్షాకాలం దృష్ట్యా ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, పారిశుధ్య అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. సర్కిల్ పరిధిలో మాదాపూర్ (107), మియాపూర్ (108), హఫీజ్‌పేట్ (109), చందానగర్ (110) నాలుగు డివిజన్లు ఉన్నాయి.

- చందానగర్ సర్కిల్ పరిధిలో మాదాపూర్ డివిజన్‌లో 7.29 కిలోమీటర్లకు రూ.62.5 లక్షలు, మియాపూర్ డివిజన్‌లో 2.99 కిలోమీటర్లకు రూ.51.5 లక్షలు, హఫీజ్‌పేట్ డివిజన్‌లో 4.24 కిలోమీటర్లకు రూ.56.5 లక్షలు, చందానగర్ డివిజన్‌లో 5.32 కిలోమీటర్ల నాలా, డ్రైనేజీలకు 134.5 లక్షలు కేటాయించారు. నాలుగు డివిజన్లకు వేరువేరుగా కాంట్రాక్టర్లకు పనులను అప్పగిస్తారు. నాలాలలో, డ్రైనేజీలలో తీసిన చెత్త చెదారంను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 40 వాహనాలలో మొదట ఆయా డివిజన్లలోని ఖాళీ ప్రదేశాలలో వేసిన అనంతరం జవహర్ నగర్‌లోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఈ సంవత్సరంకుగాను చందానగర్ సర్కిల్ 21 నుంచి 888 టన్నుల పూడికతీతను తరలించారు.

మాన్‌సూన్ టీమ్‌లకు కొత్త వాహనాలు...

వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతుల కోసం మాన్‌సూన్ టీమ్‌లను ఏర్పాటు చేస్తారు. ఇంజనీరింగ్ అధికారులు లేకుండా సిబ్బంది వెళ్ళి మరమ్మతులు పని చేసేవారు. కానీ ఈ సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ స్థాయి అధికారి కూడా మాన్‌సూన్ వాహనంలో వెళ్ళి పనులను పర్యవేక్షించే విధంగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వీరి కోసం ప్రత్యేకమైన వాహనాలను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకోనున్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న 4 డివిజన్‌లకు నాలుగు కొత్త వాహనాలు రానున్నాయి.

వర్షాకాలం సెల్లార్ తవ్వకాలకు అనుమతి లేదు

వర్షాకాలంలో నూతనంగా చేపట్టబోయే భవనాలకు సెల్లార్ తవ్వకాలకు అనుమతి లేదు. వర్షాలకు సెల్లార్ తవ్వకాలతో పక్కనే ఉన్న భవనాలకు, ఇళ్లకు ప్రమాదం వాటిల్లుతుంది. 4 నెలల పాటు తవ్వకాలకు అనుమతి ఇవ్వం. ఇప్పటికే కొన్ని సెల్లార్లను గుర్తించి నోటీసులు ఇచ్చాం. ఎవరైన సెల్లార్ తవ్వకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి